సాక్షి వైఎస్ఆర్ జిల్లా

సోమవారం : 27 : ఫిబ్రవరి : 2023



అగ్నికి అరటి తోట ఆహుతి

లింగాల మండలంలోని ఇప్పట్ల గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన అగ్నిప్రమాదంలో అరటి తోట దగ్ధమైంది. - 8లో



అప్రమత్తం.. ఖాతా భద్రం

ఖాతాదారులు అప్రమత్తంగా ఉన్నప్పుడే సైబర్ మోసాలకు అడ్డుకట్ట వేయడం సాధ్యమవుతుందని నిపుణులు చెబుతున్నారు. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం
36.5/17.3

వాతావరణం

జిల్లాలో ఆదివారం 17.3 - 36.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ అదే జోష్!

- స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా పి.రామసుబ్బారెడ్డి ఏకగ్రీవం
- నేడు ధ్రువీకరణ పత్రం అందజేయనున్న అధికారులు
- గ్రాడ్యుయేట్స్, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాల్లోనూ పట్టు బిగిస్తున్న వైఎస్సార్‌సీపీ
- ఒంటేరుకు టీడీపీ మద్దతు పలకడంతో ఓ వర్గం దూరం



సాక్షి ప్రతినిధి, కడప: ప్రజామద్దతుతో సాధారణ ఎన్నికల నుంచి విజయాల పరంపరను కొనసాగిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ అదే ఊపు ప్రదర్శిస్తోంది. తాజాగా ఉమ్మడి వైఎస్సార్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానం ఏకగ్రీవంగా ఆ పార్టీ ఖాతాలో నమోదైంది. ఈమేరకు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పి. రామసుబ్బారెడ్డి అధికారికంగా ధ్రువీకరణ పత్రం అందుకోనున్నారు. ఈ నేపథ్యంలో గ్రాడ్యుయేట్స్, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాల్లో సైతం జిల్లాలో అదే స్థాయిలో పట్టు బిగిస్తోంది. ఆ పార్టీ నేతలు ఇప్పటికే క్షేత్రస్థాయిలో ఓటర్లతో నేరుగా మమేకం అవుతున్నారు. వ్యూహ, ప్రతివ్యూహాలపై వైఎస్సార్‌సీపీ అగ్రనేతలు ప్రత్యేక దృష్టి సారించారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో 911 మంది స్థానిక సంస్థల ప్రతినిధులుంటే వారిలో 94 శాతం వైఎస్సార్‌సీపీ సభ్యులే. రాజకీయ పరిశీలకులు సైతం ఈ ఎన్నిక ఏకగ్రీవం దిశగా పయనించే అవకాశం ఉందని భావించారు. ఇదే పరిస్థితిలో స్థానిక సంస్థల్లో అత్యధిక ఓట్లున్న వైఎస్సార్‌సీపీకి ఏకగ్రీవంగా కట్టబెట్టడమే సరైన నిర్ణయమని టీడీపీ సీనియర్ నేతలు భావించారు. కాగా 4శాతం ఓట్లున్నా సరే టీడీపీ నేతలు కొందరు పోటీగా నామినేషన్ దాఖలు చేయించారు. నామినేషన్‌ను బలపర్చేందుకు ఓటర్లు ముందుకు రాకపోవడంతో ఓటర్ల సంతకాలు ఫోర్జరీ చేశారు. అదే విషయాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారి దృష్టికి స్వయంగా ఓటర్లు తీసుకురావడంతో పరిశీలనలో టీడీపీ నేత రమణయ్య యాదవ్ నామినేషన్ తిరస్కరణకు గురైంది. దీంతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పి.రామసుబ్బారెడ్డి వేసిన నామినేషన్ ఒక్కటి మాత్రమే నిలిచింది. ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు సోమవారం ధ్రువీకరించాల్సి ఉంది.

▶▶ గ్రాడ్యుయేట్స్‌లో సైతం..



వెన్నపూస రవీంద్రారెడ్డి


పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా అనేక మంది పోటీలో ఉన్నప్పటికీ ప్రధానంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, పీడీఎఫ్ అభ్యర్థి నాగరాజు, టీడీపీ అభ్యర్థి రాంగోపాల్‌రెడ్డిల మధ్య పోటీ నడుస్తున్నట్లు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో వైఎస్సార్‌సీపీ స్పష్టమైన ఆధిక్యత ప్రదర్శిస్తుండడం, గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా యువతకు ప్రత్యక్ష ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో వెన్నపూస రవీంద్రారెడ్డి విజయం అతి సునాయసం కానుందని పరిశీలకులు పేర్కొంటున్నారు. దీంతోపాటు క్షేత్రస్థాయిలో ఓటింగ్ చేయించుకునే కేడర్ కూడా ఉండడం వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి బాగా కలిసి వచ్చే అంశంగా భావిస్తున్నారు. దీంతో టీడీపీ అభ్యర్థి రాంగోపాల్‌రెడ్డి, పీడీఎఫ్ అభ్యర్థి నాగరాజులను రెండు, మూడు స్థానాల్లోకి నెట్టేయడం ఖాయమనే అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. నానాటికీ టీడీపీ పోటీ కూడా ఇవ్వలేని పరిస్థితికి దిగజారిపోతున్నట్లు సమాచారం. మొత్తానికి ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ దూకుడుగా ముందుకు వెళుతోందనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది.

స్థానిక సంస్థల ఎమ్మెల్సీని కైవసం చేసుకున్న వైఎస్సార్‌సీపీ టీచర్స్, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ స్థానాలు సాధించుకునేందుకు విశేషంగా కృషి చేస్తోంది. ఆ మేరకు జిల్లా నుంచి విస్తృతంగా మద్దతు సమీకరించేందుకు క్షేత్రస్థాయి పర్యటనలు, సమీక్షలు నిర్వహిస్తోంది. టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థుల్లో ప్రధాన పోటీదారులంతా జిల్లా వాసులు కావడంతో మరింత కీలకంగా వ్యవహరిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఎంవీ రామచంద్రారెడ్డి, పీడీఎఫ్ అభ్యర్థిగా కత్తి నరసింహారెడ్డి, ఏపీటీఎఫ్, ఆర్‌జేయూపీ, తదితర సంఘాలు, తెలుగుదేశం పార్టీ మద్దతుతో ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, హెడ్‌మాస్టర్స్ అసోసియేషన్ నుంచి నారాయణరెడ్డి పోటీ చేస్తున్నారు. వీరంతా ఎవరి స్థాయిలో వారు ఉపాధ్యాయుల మద్దతు కోరుతున్నారు.

▶▶ టీచర్స్ ఎమ్మెల్సీ స్థానంలో..

టీడీపీ మద్దతు ఇవ్వడంతో...

టీచర్స్ ఎమ్మెల్సీగా గతంలో పోటీ చేసి ఓటమి చవిచూసిన ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మరోమారు అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఉపాధ్యాయ సంఘాలతో మమేకమై ప్రచారం చేసుకుంటున్న ఆయనకు తెలుగుదేశం పార్టీ మద్దతు ప్రకటించింది. దాంతో ఓ వర్గం పూర్తిగా దూరమైంది. అప్పటి వరకూ పోటీదారుడుగా ఉన్న ఆయన ఒక్కమారుగా వెనుకంజలో పడ్డట్లు విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. మరోవైపు ఉద్యమనేతకు ఉపాధ్యాయులు మద్దతు ఇవ్వాలని పలు సంఘాలు కోరుతున్నాయి. ఉద్యమనేత కత్తి నరసింహారెడ్డికి ఇదివరకే అవకాశం ఇచ్చిన నేపథ్యంలో మరోమారు ఆయనకు ఛాన్సు ఇచ్చేందుకు విముఖత చూపుతున్నారనే అభిప్రాయాన్ని పరిశీలకులు వెల్లడిస్తున్నారు. వెరసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎంవీ రామచంద్రారెడ్డికి అనూహ్య మద్దతు లభిస్తోంది. వైఎస్సార్‌సీపీకి పుట్టినిల్లు అయిన జిల్లాలో ఆయనకు ఉపాధ్యాయ వర్గాల నుంచి విశేష ఆదరణ లభిస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విజయానికి ప్రజాప్రతినిధులు సైతం సహకారం అందిస్తుండడంతో జిల్లాలో భారీ స్థాయిలో టీచర్లు అండగా నిలుస్తున్నారని పలువురు వివరిస్తున్నారు.



ఎంవీ రామచంద్రారెడ్డి

ఎమ్మెల్సీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలి



శిల్పారామంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె. సురేష్ బాబు, వేదికపై డిప్యూటీ సీఎం అంజద్‌బాషా తదితరులు

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.సురేష్‌బాబు, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాలకు వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీ చేస్తున్న ఎంవీ రామచంద్రారెడ్డి, వెన్నపూస రవీంద్రారెడ్డిలను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, కడప మేయర్ కె. సురేష్ బాబు, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక శిల్పారామంలో ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంవీ రామచంద్రారెడ్డితో కలిసి 36 ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘాలు, ప్రైవేటు పాఠశాలల సంఘాల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఉపాధ్యాయులంతా సమష్టిగా ఎంవీ రామచంద్రారెడ్డికి మద్దతు పలకాలని కోరారు. అలాగే కడప అపూర్వ కల్యాణ మండపంలో కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జులు, అనుబంధ సంఘాల అధ్యక్షులతో కలిసి నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన ఈ మూడున్నర ఏళ్లలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రాబోయే పట్టభద్రుల ఎన్నికల్లో వెన్నపూస రవీంద్రారెడ్డి విజయానికి పార్టీ నాయకులు అంకిత భావంతో కృషి చేయాలన్నారు.అనంతరం ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో పోటీ చేస్తున్న తనకు ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలని కోరారు. శిల్పారామంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి, ఎలియాస్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, కార్పొరేటర్లు సూర్యనారాయణరావు, షఫీ, రామలక్ష్మణ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బారెడ్డి, తోటక్రిష్ణ, అహ్మద్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు. అపూర్వ కల్యాణమండపంలో జరిగిన సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మాసీమ బాబు, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, రాము, ప్రసాద్‌రెడ్డి, కిరణ్, జగన్ పాల్గొన్నారు.



అపూర్వ కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

న్యూస్‌రీల్

కడప మార్కెట్ యార్డులో మళ్లీ కొనుగోళ్లు బంద్

కడప అగ్రికల్చర్: కడపలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం నుంచి మళ్లీ వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు టర్మరిక్ మర్చంట్స్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. గతంలో మార్కెట్‌యార్డులో పండ్లు నిల్వ చేసుకునేందుకు వీలుగా శీతల గోదామును నిర్మించుకునేందుకు పను లు చేపట్టారు. ఇది మార్కెట్ యార్డు నిబంధనలకు విరుద్ధమని కమీషన్ ఏజెంట్లు అప్పట్లో అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో కొంతమంది ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని తాత్కాలికంగా పనులను నిలుపుదల చేశారు. అయితే మళ్లీ సదరు వ్యక్తి కోర్టు ద్వారా పనులు చేసుకునేందుకు వీలుగా అనుమతులను తెచ్చుకుని పనులు మొదలు పెట్టినట్లు తెలిసింది. ఇందుకు నిరసనగా మార్కెట్ యార్డు అసోసియేషన్ నాయకులు కొనుగోళ్లను నిలుపుదల చేసినట్లు తెలిసింది. ఈ విషయం గురించి మార్కెట్‌యార్డు సెక్రటరీ వెంకటరెడ్డిని వివరణ కోరగా టర్మరిక్ మర్చంట్స్ అసోసియేషన్ నాయకులు ఎవరూ ఈ సమస్యను తన దృష్టికి తీసుకురాలేదని తెలిపారు.

ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం



కడప మరియాపురం జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్ఐఓ రమణరాజు

కడప ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరానికి సంబంధించి జనరల్, ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు జిల్లావ్యాప్తంగా ఆదివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులంతా నిర్ణీత సమయానికే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్షా కేంద్రాలలో ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇంటర్ అధికారులు అన్ని వసతులను ఏర్పాటు చేశారు. ప్రాక్టికల్ పరీక్షల్లో భాగంగా ఎంపీసీ, బైపీసీకి సంబంధించి ఉదయం, సాయంత్రం రెండుపూటలా కలిపి 6181 మంది విద్యార్థులకు 5976 మంది హాజరయ్యారు. 205 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఇందులో ఉదయం సెషన్‌కు సంబంధించి 74 పరీక్షా కేంద్రాలకు 3469 మంది హాజరు కావాల్సి ఉండగా 3354 మంది హాజరు కాగా 115 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం సెషన్‌కు సంబంధించి 72 పరీక్షా కేంద్రాలకు గాను 2712 మంది విద్యార్థులకు 2622 మంది హాజరుకాగా 90 మంది గైర్హాజరయ్యారు. కడప నగరంలోని 14 పరీక్షా కేంద్రాలను ఆర్ఐఓ రమణరాజు తనిఖీ చేశారు. అలాగే ప్రాక్టికల్ పరీక్షల రాష్ట్ర పరిశీలకుడు రమణగుప్తా, డీవీఈఓ శ్రీనివాసులరెడ్డితో పాటు డీఈసీ సభ్యులతో పాటు స్క్వాడ్ సభ్యులు కూడా పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

అన్నమయ్య జిల్లా.. క్షేత్రాల ఖిల్లా



హార్సీలీ హిల్స్‌లోని అందమైన ప్రాంతం



గుర్రంకొండ కోటలోని రాణి మహల్



అత్తిరాలలోని త్రేతేశ్వరస్వామి ఆలయం

- పదుల సంఖ్యలో పర్యాటక ప్రాంతాలు
- అద్భుతమైన ఆలయాలు
- హార్సిలీహిల్స్, గుర్రంకొండ, సిద్దవటం కోట తదితర చారిత్రక ప్రదేశాలు

SAKSHI SPECIAL

సాక్షి రాయచోటి: అన్నమయ్య జిల్లా పర్యాటక ప్రాంతాల ఖిల్లాగా మారింది. అద్భుతమైన విడిది ప్రదేశాలు, అందమైన కొండ కోనల మధ్య ఉన్న ఆలయాలు ఆకట్టుకుంటున్నాయి. చారిత్రక కట్టడాలుగల కోటలు జిల్లా సొంతం. ప్రసిద్ధి చెందిన అనేక ఆలయాలు కూడా జిల్లాలో అలరారుతున్నాయి. పవిత్ర నదులుగా గుర్తింపు పొందిన మాండవ్య, బాహుదా, చెయ్యేరు, పెన్నానదులు ప్రవహిస్తుండగా..వాటి ఒడ్డున అనేక దేవాలయాలు భక్తుల పూజలందుకుంటున్నాయి. ప్రతినిత్యం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో అన్నమయ్య జిల్లాలోని ఆలయాలకు వచ్చి వెళుతుండడం విశేషం.

భక్తుల కొంగు బంగారంగా పవిత్ర పుణ్యక్షేత్రాలు

జిల్లాలో చారిత్రాత్మక ప్రాశస్త్యం కలిగిన అనేక పుణ్యక్షేత్రాలు కొలువుదీరాయి. ప్రధానంగా రాయచోటి వీరభద్రస్వామి ఆలయం, నందలూరు శ్రీ సౌమ్యనాథస్వామి ఆలయం, అత్తిరాల శ్రీ త్రేతేశ్వరస్వామి ఆలయం, తాళ్లపాక అన్నమయ్య, తంబళ్లపల్లెలోని మల్లెయ్యకొండ, తరిగొండ లక్ష్మి నరసింహాస్వామి, రెడ్డెమ్మ కోన, వాల్మీకిపురం కోదండ రామాలయం, లక్కిరెడ్డిపల్లె అనంతపురం గంగమ్మ ఆలయం, మదనపల్లె శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి, రైల్వేకోడూరు పరిధిలోని గుండాల కోన, సిద్దవట మండల పరిధిలోని శ్రీ నిత్యపూజ స్వామి ఆలయం తదితర క్షేత్రాలు భక్తులకు కొంగుబంగారంగా వెలుగొందుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి ప్రతిరోజు భక్తులు ఆయా క్షేత్రాలను సందర్శిస్తుంటారు.

అటువైపు బౌద్ధారామాలు.... ఇటువైపు గుర్రంకొండ

జిల్లాలో చరిత్రకు కొదవ లేదు. చారిత్రాత్మక కట్టడాలకు పెట్టింది పేరు. నందలూరు మండల పరిధిలోని అడపూరులో సహజ సిద్ధంగా ఏర్పడిన బౌద్ధారామాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. అంతేకాకుండా చరిత్రలో గొప్పగా చెప్పుకునేలా సిద్దవటం, గుర్రంకొండలోని రాజుల కాలం నాటి కోటలు చరిత్రకెక్కాయి. అద్భుతమైన కట్టడాలకు ఆ కాలం నాటి కోట గోడలు నేటికీ చెక్కుచెదరని వైనం అబ్బురపరిచే అంశం. అన్నమయ్య జిల్లాలో రూపు దిద్దుకున్న వెలిగల్లు ప్రాజెక్టు నీటితో కళకళలాడుతోంది.

వేసవి విడిది హార్సీలీ హిల్స్

హార్సీలీహిల్స్ పేరు వినగానే వేసవి విడిదిగా చెప్పుకుంటారు. తెలంగాణ, ఏపీతోపాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన అనేక మంది వేసవిలో విడిది చేస్తారు. వందేళ్ల కిందట బ్రిటీషు కాలంలో నిర్మించిన భవనాలు నేటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయి. వేసవిలోనూ చల్లని ఆహ్లాదాన్ని పంచుతుండడంతో పర్యాటకులు వస్తుంటారు. రాజంపేట ఫారెస్టు పరిధిలోని జంగిల్ సఫారీ, రెడ్‌వుడ్ ప్రాంతాలను అటవీశాఖ అందుబాటులోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

పలు రైళ్ల గడువు పొడిగింపు



కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప మీదుగా నడిచే పలు రైళ్ల గడువును పొడిగించినట్లు కడప రైల్వేస్టేషన్ మేనేజర్ నరసింహారెడ్డి, కడప రైల్వే చీఫ్ టిక్కెట్ ఇన్‌స్పెక్టర్ ఉమర్‌బాషా తెలిపారు.

- షోలాపూర్-తిరుపతి-షోలాపూర్ (01 437/38) మధ్య నడుస్తున్న ప్రత్యేక రైలును జూన్ 30 వరకు పొడిగించారు.
- చెన్నై-శివమొగ్గ (06223/24)ల మధ్య నడిచే రైలును మార్చి 28వ తేది వరకు పొడిగించారన్నారు. ప్రతి మంగళ, ఆదివారాల్లో శివమొగ్గలో బయలుదేరి కడపకు తెల్లవారుజామున ఉదయం 5.58 గంటలకు చేరుతుందన్నారు. చెన్నైకి 11.10 గంటలకు చేరుతుందని వివరించారు. ప్రతి సోమ, బుధ వారాల్లో ఈ రైలు చెన్నైలో మధ్యాహ్నం 3.50 గంటలకు బయలుదేరి కడపకు రాత్రి 8.03 గంటలకు చేరుకుంటుందన్నారు.
- తిరుపతి-జాల్నా (07413/14)ల మధ్య నడిచే రైలు ప్రతి మంగళవారం సాయంత్రం 6.30 గంటలకు తిరుపతిలో బయలుదేరుతుందన్నారు. కడపకు రాత్రి 8.38 గంటలకు చేరుకుని మరుసటిరోజు సాయంత్రం జాల్నాకు చేరుతుందన్నారు. ఈ రైలు ప్రతి ఆదివారం ఉదయం 11.50 గంటలకు జాల్నాలో బయలుదేరి మరుసటిరోజు తెల్లవారుజామున 5.38 గంటలకు కడపకు చేరుకుని తిరుపతికి 9.05 గంటలకు చేరుతుందన్నారు. ఈ రైలు జూన్ 4వ తేది వరకు పొడిగించారు.
- అహ్మదాబాద్-తిరుచునాపల్లి (09419/20) మధ్య నడుస్తున్న రైలు మార్చి 30వ తేదీ వరకు పొడిగించారు. ఈ రైలు అహ్మదాబాద్‌లో ప్రతి గురువారం ఉదయం 9.30 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 9.58 గంటలకు కడపకు చేరుతుందన్నారు. తిరుచునాపల్లిలో ప్రతి ఆదివారం తెల్లవారుజామున 5.45 గంటలకు బయలుదేరి రాత్రి 8.25 గంటలకు కడపకు చేరుతుందన్నారు. ఈ రైలును ఏప్రిల్ 2వ తేదీ వరకు పొడిగించారన్నారు.
- హైదరాబాదు-తిరుపతి (07643/44)మధ్య నడిచే ప్రత్యేక రైలు ప్రతి సోమవారం రాత్రి 7.30 గంటలకు బయలుదేరి మరుసటిరోజు తెల్లవారుజామున 5.00 గంటలకు కడపకు చేరుకుని 10.00 గంటలకు తిరుపతి చేరుతుందన్నారు. ఈ రైలు ప్రతి మంగళవారం మధ్యాహ్నం 3.00 గంటలకు తిరుపతిలో బయలుదేరి సాయంత్రం 5.03 గంటలకు కడపకు చేరుతుందన్నారు. మే 29వ తేదీ వరకు ఈ రైలును పొడిగించారన్నారు.

పుష్ప 'గిరి' ప్రదక్షిణకు యత్నాలు

- మార్చి 1న నిర్వహణకు పీఠాధిపతి ముహూర్తం
- ధార్మిక సంస్థలు, ప్రముఖుల సహకారంతో ఏర్పాట్లు



గిరి ప్రదక్షిణ చేయనున్న కొండ దృశ్యం

కడప కల్చరల్ : పుష్పగిరిలో గిరి ప్రదక్షిణ కోసం యత్నాలు సాగుతున్నాయి. తమిళనాడులోని అరుణాచలంలో గిరి ప్రదక్షిణకు విశేష ప్రాచుర్యం ఉంది. సరిగ్గా అలాంటి కార్యక్రమమే పుష్పగిరిలో నిర్వహించాలని జిల్లాకు చెందిన కొందరు ధార్మిక సంస్థల ప్రతినిధులు రెండు మాసాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. మార్చి 1న ఈ కార్యక్రమం నిర్వహించాలని పుష్పగిరి ప్రస్తుత పీఠాధిపతి ముహూర్తం కూడా నిర్ణయించారు. కార్యక్రమానికి కేవలం రెండు రోజులే సమయం ఉండడంతో నిర్వాహకులు కొండచుట్టూ దారి ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. గిరి ప్రదక్షిణ అనగానే మనకు అరుణాచలం గుర్తుకు వస్తుంది.

మన జిల్లాలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం, పర్యాటక ప్రాంతమైన పుష్పగిరి (కొండ) చుట్టూ 60 సంవత్సరాల క్రితం ప్రదక్షిణ జరిగేదని, దాన్ని పునరుద్ధరించడం ఆ క్షేత్రానికే కాకుండా జిల్లాకు అన్ని విధాలా శ్రేయస్కరమని పలువురు ధార్మిక వేత్తలు భావిస్తున్నారు. కడప నగరానికి చెందిన న్యాయవాది, రాష్ట్ర దేవాలయాల పరిరక్షణ సమితి ప్రతినిధి సట్టి భారవి ఈ విషయంలో చొరవ చూపుతున్నారు. పలువురు పండితులను కలిసి గిరి ప్రదక్షిణ విషయాన్ని ధ్రువీకరించుకున్నారు. విషయాన్ని సంబంధిత ప్రజాప్రతినిధుల దృష్టికి తెచ్చారు. జిల్లాకు మంచి జరిగితే తమకూ ఇష్టమేనని, అంతవరకు సహకరిస్తామని పెద్దలు హామీ ఇవ్వడంతో గిరి ప్రదక్షిణ ఏర్పాట్లు ప్రారంభించారు. జిల్లా దేవదాయశాఖ అధికారులను ఆర్థికసాయం కోరారు. పుష్పగిరి ప్రస్తుత పీఠాధిపతిని కలిసి ఈ విషయంపై చర్చించారు. ఆయన మార్చి 1న పుష్పగిరిలో గిరి ప్రదక్షిణకు ముహూర్తం నిర్ణయించారు. అప్పటి నుంచి ప్రయత్నాలు జోరందుకున్నాయి.

మంచిదేనా?

గిరి ప్రదక్షిణ జరిగి మంచి ప్రచారం లభించి క్రమం తప్పక కనీసం మూడు, నాలుగేళ్లయినా కార్యక్రమం నిర్వహించగలిగితే పుష్పగిరి క్షేత్రం అభివృద్ధి అయ్యే అవకాశం ఉంది. పర్యాటకంగా కూడా ప్రాముఖ్యత సంతరించుకుంటుంది. ట్రాన్స్‌పోర్టు తదితర వ్యాపారాలు పెరిగే అవకాశం ఉంది. ఇంతకుముందు గిరి ప్రదక్షిణ జరిగిందో లేదో ఆధారాలు లేవుగానీ ప్రయత్నం మంచిదేనంటూ భక్తులు, స్థానిక పెద్దలు ప్రోత్సహిస్తుండడంతో నిర్వాహకులు ఒకవైపు అనుమతులు, మరోవైపు రోడ్డు నిర్మాణం, ఇంకోవైపు జన సమీకరణలపై ప్రత్యేక దృష్టి సారించారు.

▶▶ కొండచుట్టూ రోడ్డు



కొండ చుట్టూ జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులు

ప్రస్తుతం పుష్పగిరిలో నది ఒడ్డున దేవాలయాలు ఉన్న కొండచుట్టూ గిరి ప్రదక్షిణ చేయా లని నిర్ణయించినా సరైన దారి లేకపోవడంతో తొలుత రోడ్డు నిర్మాణంపై దృష్టి సారించారు. కొండచుట్టూ దాదాపు 12 కిలోమీటర్లు నడవాల్సి ఉండగా సగానికి పైగా మార్గంలో రాళ్లు, ముళ్ల పొదలు ఉండడంతో వాటిని శుభ్రం చేసి తాత్కాలికంగా కచ్చా రోడ్డు వేసేందుకు వివిధ యంత్రాలతో పనులు చేపట్టారు. సమీప గ్రామాల్లో ప్రచారం చేసి ప్రదక్షిణ నాటికి పెద్ద ఎత్తున జన సమీకరణ చేసేందుకు కూడా స్థానిక పెద్దల సహకారంతో ప్రయత్నాలు చేస్తున్నారు.

క్లుప్తంగా

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి




మాట్లాడుతున్న శివారెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనిట్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. ప్రొద్దుటూరు డిపోలో ఆదివారం అసోసియేషన్ రీజినల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీ శివారెడ్డి, రీజినల్ చైర్మన్ పి.రామిరెడ్డి, కార్యదర్శి పి.సుధాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రీజినల్ వ్యాప్తంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో జోనల్ నాయకుడు రామకృష్ణ, రీజినల్ నాయకులు మోహన్‌రెడ్డి, దాస్, డిపోల అధ్యక్ష, కార్యదర్శులు, గ్యారేజి కార్యదర్శులు పాల్గొన్నారు.

వాహనాల స్పెషల్ డ్రైవ్‌లో 204 కేసులు

కడప అర్బన్ : జిల్లాలో ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు పోలీసులు చేపట్టిన వాహనాల స్పెషల్ డ్రైవ్‌లో ఆదివారం 204 కేసులు నమోదు చేశారు. ఇందులో హెల్మెట్ ధరించకుండా ద్విచక్రవాహనాలు నడిపిన వారిపై 179 కేసులు, సీటు బెల్ట్ పెట్టుకోకుండా వెళ్తున్న కార్లు, జీపులు తదితర వాహన చోదకులపై 25 కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు.

ప్రభుత్వ బియ్యం పట్టివేత



వాహనంలో ఉన్న బియ్యం బస్తాలు

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణ పరిధిలోని వై.జంక్షన్ వద్ద అక్రమంగా తరలిస్తున్న 26 బస్తాల ప్రభుత్వ బియ్యంను స్వాధీనం చేసుకున్నారు. వాటిని తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నారు. డ్రైవర్ అస్లం, కూలీ సురేంద్రను అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. రేషన్ కార్డుదారుల నుంచి వారు బియ్యం కొనుగోలు చేశారని ఆయన పేర్కొన్నారు.

అప్రమత్తం.. ఖాతా భద్రం



- బ్యాంక్ ఖాతాల్లో మాయమవుతున్న నగదు
- ఏఈపీఎస్ ద్వారా తస్కరిస్తున్న సైబర్ నేరగాళ్లు
- పోరుమామిళ్ల ప్రాంతంలో వందకుపైనే బాధితులు
- బ్యాంకర్ల సూచనలు పాటించాలంటున్న నిపుణులు



పోరుమామిళ్ల ఎస్‌బీఐలో ఖాతాదారులతో మాట్లాడుతున్న సిబ్బంది

బద్వేలు : సైబర్ నేరగాళ్లు విజృంభిస్తున్నారు. సామాన్యుల ఖాతాల నుంచి నగదు తస్కరిస్తున్నారు. ఈ నెల 18 నుంచి 22 తేదీల వ్యవధిలో పోరుమామిళ్ల పరిసర ప్రాంతాల్లోని బ్యాంకు ఖాతాదారుల నుంచి వందకు పైగా ఫిర్యాదులు అందాయి. రోజూ వీటి సంఖ్య పెరుగుతూనే ఉంది. నగదు విత్ డ్రా చేయడంపై వారు బ్యాంకు సిబ్బందిని సంప్రదిస్తున్నారు. ఇప్పటికే ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఒక ముఠాను జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. వీటిపై ఖాతాదారులే భద్రంగా ఉండాలని, అప్పుడే ఈ మోసాలకు అడ్డుకట్ట సాధ్యమవుతుందని నిపుణులు చెబుతున్నారు.

సాంకేతికత పెరిగిన తరువాత బయోమెట్రిక్ వినియోగమూ పెరిగింది. ప్రభుత్వ పథకాలతో పాటు బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేస్తున్నారు. బ్యాంకులు సైతం ఆధార్ ఎనేబుల్ పేమెంట్ సిస్టమ్ (ఏఈపీఎస్)ను అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా బ్యాంకులు అనుమతించిన బిజినెస్ కరస్పాండెంట్ (బీసీ) వద్ద ఆధార్‌కార్డు బయోమెట్రిక్ ద్వారా నగదు విత్‌డ్రా, డిపాజిట్, నగదు విచారణ వంటి వాటిని చేయవచ్చు. దీన్నే సైబర్ నేరగాళ్లు అనరాగా తీసుకుని ఖాతాదారులను మోసం చేస్తున్నారు.

పెరుగుతున్న నేరాలు

ఈ మధ్య కాలంలో ఏఈపీఎస్ నేరాలు పెరుగుతున్నాయి. దేశవ్యాప్తంగా ఆరు నెలల్లో దాదాపు ఐదు వేలకు పైగా పోలీస్ కేసులు నమోదు అయ్యాయి. ఇవి కాక కేవలం బ్యాంకుల్లో ఫిర్యాదు చేసినవి, ఫిర్యాదు చేయక వదిలేసినవి నాలుగింతలు పైనే ఉన్నాయని అంచనా. కేవలం నాలుగు రోజుల వ్యవధిలో పోరుమామిళ్ల, కాశినాయన, కలసపాడు మండలాల పరిధిలోని బ్యాంకు ఖాతాదారుల్లో వంద మందికి పైగా ఖాతాల నుంచి నగదును సైబర్ నేరగాళ్లు దోచుకున్నారు. ఇందులో రూ.50 వేల నుంచి రూ.10 వేల వరకు పోగొట్టుకున్న వారు ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా కూడా ఇలాంటి సంఘటనలు ఉన్నాయని పోలీసులు చెబుతున్నారు.

వారి ఖాతాకు వారే రక్ష

ఏఈపీఎస్ వినియోగంలోకి వచ్చిన తరువాత ఖాతాదారులే తమ ఖాతాకు రక్షణ ఏర్పాటు చేసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ఇందుకుగాను పలు పద్ధతులు అందుబాటులో ఉన్నాయంటున్నారు. నిపుణులు పేర్కొంటున్న సూచనలు కూడా సైబర్ నేరాలకు అడ్డు కట్ట వేయగలవు.

ఎం ఆధార్‌తో లాక్

ఎం ఆధార్ యాప్‌తో ఆధార్ కార్డు బయోమెట్రిక్‌ను లాక్ చేసుకోవచ్చు. స్మార్ట్‌ఫోన్ ఉన్న వారు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఓటీపీతో లాగిన్ అయిన తరువాత బయోమెట్రిక్‌ను లాక్ చేసుకోవచ్చు. అవసరమైన సమయంలో అన్‌లాక్ చేసుకుని వినియోగించుకోవచ్చు. అవసరం తరువాత తిరిగి లాక్ చేసుకోవచ్చు. ఆధార్ వెబ్‌సైట్‌లో సైతం బయోమెట్రిక్‌ను లాక్, అన్‌లాక్ చేసుకోవచ్చు.

పాటించాల్సిన సూచనలు

- నమ్మకమైన, తెలిసిన బ్యాంకు బిజినెస్ కరస్పాండెంట్‌ల వద్ద మాత్రమే నగదు లావాదేవీలు చేయాలి.
- ప్రయివేట్ వ్యక్తులు, వెబ్‌సైట్లలో బయోమెట్రిక్‌ను వినియోగించవద్దు.
- ఖాతాల సమాచారం, ఫోన్ నంబర్, ఓటీపీల వివరాలను ఎవరికి తెలపవద్దు. బ్యాంకులు ఈ సమాచారాన్ని ఎప్పటికీ అడగవు.
- ఖాతాలకు సంబంధించి ఎటువంటి సమస్య వచ్చినా బ్యాంకును సంప్రదించి పరిష్కరించుకోవచ్చు. బయటి వ్యక్తులకు ఈ సమాచారం ఇవ్వడం చాలా ప్రమాదకరం.
- బహుమతులు, నగదు పేరుతో వచ్చే లింక్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఆశ పెట్టి మీ ఖాతాల సమాచారం తీసుకుని నగదు దోచుకునేందుకు మాత్రమే ఇలాంటివి పంపుతుంటారని గమనించుకోవాలి.
- ఏఈపీఎస్ సిస్టమ్‌ను వినియోగించుకోని వారు ఆ సౌలభ్యాన్ని తొలగించుకోవాలి.

డబ్బు పోతే ఏమి చేయాలి

- నగదు పోయిన విషయాన్ని గమనిస్తానే నేషనల్ క్రైమ్ పోర్టల్ ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబరు 1930కు ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా సమాచారాన్ని ఇవ్వాలి. అప్పుడు డబ్బు ట్రాన్స్‌ఫర్ అయిన ఖాతాను ఫ్రీజ్ చేసి నగదును వెనక్కి తీసుకువచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఆలస్యమైతే నేరస్తులు డబ్బు డ్రా చేసుకుంటారు.
- ఏపీ పోలీసులు ఏర్పాటు చేసిన సైబర్‌మిత్ర వాట్సాప్ నంబర్ 9121211100కు ఫిర్యాదు చేయవచ్చు.
- నగదు పోయిన వెంటనే బ్యాంకును సంప్రదించి ఏఈపీఎస్ సిస్టమ్‌ను తొలగించుకోవాలి. అప్పుడే మరోసారి నష్టపోకుండా చూసుకోవచ్చు.

అవగాహనతో అడ్డుకట్ట



ప్రతి ఖాతాదారుడు సైబర్ నేరాల పట్ల అవగాహన ఏర్పర్చుకోవాలి. సాంకేతికతను ఉపయోగించుకుని నేరస్తులు ఖాతాల్లో నగదును దొంగలిస్తున్నారు. ఏఈపీఎస్‌ను వారు ఎక్కువగా ఉపయోగించుకుంటున్నారు. తక్షణమే ఫిర్యాదు చేస్తే మోసపూరిత ఖాతాలను ఫ్రీజ్ చేయవచ్చు. ఈ మధ్య కాలంలో ఫిర్యాదులు పెరిగాయి. దీనిపై బ్యాంకర్లతో కలిసి ఖాతాదారులకు అవగాహన కల్పిస్తాం.

– సురేష్‌రెడ్డి, సీఐ, పోరుమామిళ్ల

బ్యాంకును సంప్రదించాలి



ఖాతాదారులు ఎటువంటి సమస్య వచ్చినా బ్యాంకును వెంటనే సంప్రదించాలి. బ్యాంక్ సిబ్బంది ఫోన్ ద్వారా ఎప్పటికీ సమాచారం అడగరు. ఈ విషయాన్ని గుర్తు పెట్టుకుని ఓటీపీ, ఖాతా నంబరు, లింకైన ఫోన్ నంబరును ఎవరికీ చెప్పవద్దు. బ్యాంకులో ఎటువంటి మోసం జరగదు. సోషల్ మీడియాలో వచ్చే కథనాలను నమ్మి ఆందోళన చెందవద్దు. మీ ఖాతాకు మీరే రక్షకులు.

– నవీన్‌కుమార్ రెడ్డి, మేనేజర్, ఎస్‌బీఐ, పోరుమామిళ్ల

రిటైర్డ్ ఇన్‌కమ్‌ట్యాక్స్ అధికారి ఇంట్లో చోరీ

మదనపల్లె : రిటైర్డ్ ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారి ఇంట్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. తాలూకా పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణ సమీపంలోని అంకిశెట్టిపల్లె పంచాయతీ టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్న రిటైర్డ్ ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారి బాలకృష్ణారెడ్డి ఇటీవల వైద్య పరీక్షల నిమిత్తం బెంగళూరుకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు తలుపులు బద్దలు కొట్టి ఆ ఇంట్లోకి చొరబడ్డారు. నగలు, నగదు అపహరించారు. ఆదివారం ఇంటి తలుపులు తెరచి ఉండటంతో స్థానికులు గమనించి తాలూకా పోలీసులకు సమాచారం అందించారు. సీఐ సత్యనారాయణ, ఎస్ఐ చంద్రశేఖర్ సిబ్బందితో కలిసి వెళ్లి పరిశీలించారు. అయితే ఇంటి యజమాని బాలకృష్ణారెడ్డి లేకపోవడంతో ఎంత చోరీ జరిగిందన్న విషయం తెలియరాలేదు. సోమవారం బాధితులు వచ్చిన తర్వాత తెలిసే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. దుండగులు ఆధారాలు లభించకుండా ఇంటి చుట్టూ, ఇంట్లో కారంపొడి వేశారని, క్లూస్ టీం ద్వారా తనిఖీలు నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు.

గాయపడ్డ కార్మికుడి మృతి

మదనపల్లె : మండలంలోని సీటీఎం శ్రీనివాస కల్యాణ మండపం వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన భవన నిర్మాణ కార్మికుడు శనివారం రాత్రి మృతి చెందాడు. పట్టణంలోని గొల్లపల్లె దళితవాడకు చెందిన సురేష్‌బాబు(36) భవన నిర్మాణ కార్మికుడిగా జీవనం సాగిస్తుండే వాడు. ఆయన ఈ నెల 21న సీటీఎం నుంచి ద్విచక్రవాహనంలో వస్తుండగా.. మదనపల్లె నుంచి కలకడకు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయన తీవ్ర గాయాల పాలయ్యాడు. అటుగా వెళుతున్న ప్రయాణికులు గుర్తించి మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం చెన్నై ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతున్నా.. పరిస్థితి విషమించడంతో శనివారం రాత్రి మరణించాడు. ఆయనకు భార్య సుశీల, మూడో తరగతి చదువుతున్న కుమార్తె ఉన్నారు.

బావిలో పడి విద్యార్థి మృతి

- హాస్టల్ గోడ దూకి ఈతకు వెళ్లిన 9 మంది పిల్లలు
- తిరుగు ప్రయాణంలో మృత్యువాత



మృతి చెందిన కార్తీక్

ఖాజీపేట : సరదాగా తోటి వారితో ఈతకు వెళ్లిన ఓ విద్యార్థి.. బావిలో పడి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఖాజీపేట ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లోని 9 మంది 10వ తరగతి విద్యార్థులు ఆదివారం సెలవు రోజు కావడంతో ఈతకు వెళ్లాలని భావించారు. హాస్టల్ పై నుంచి కిటికీ సన్‌సైడ్ బండ మీదికి దిగారు. అక్కడి నుంచి రక్షణ గోడ పైకి వచ్చి బయటకు దూకేశారు. హాస్టల్ సమీపంలోని చెర్లోపల్లె పొలంలో బావి దగ్గరకు వెళ్లారు. వారిలో ఇద్దరికి మాత్రమే ఈత వస్తుంది. వారితో కలిసి ఈత రాని ఇద్దరు విద్యార్థులు ఈత కొట్టారు. తిరిగి వచ్చేందుకు అందరూ కాళ్లు కడుక్కునేందుకు బావిలోకి దిగారు. వారిలో కార్తీక్ కాళ్లు కడుక్కుంటుండగా.. కాలు జారి బావిలో పడ్డాడు. ఈత రాకపోవడంతో మృతి చెందాడు.

స్థానికుల సాయంతో బయటకు మృతదేహం

మిగతా విద్యార్థులు గట్టిగా కేకలు వేయడంతో.. పొలం, గ్రామంలోని వారు వచ్చి కార్తీక్ మృతదేహాన్ని బయటకు తీశారు. ఆలోపే హాస్టల్ వార్డన్‌కు సమాచారం ఇచ్చారు.

విచారణ చేసిన సీఐ

బావి వద్దకు మైదుకూరు రూరల్ సీఐ నరేంద్రారెడ్డి, ఎస్ఐ కుళ్ళాయప్ప చేరుకుని పరిశీలించారు. అనంతరం హాస్టల్‌కు వెళ్లి విద్యార్థులను విచారణ చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మృతిపై అనుమానం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

బి.కోడూరు : మండలంలోని ఎం.నరసింహ్మాపురం గ్రామానికి చెందిన యడవల్లి ప్రసాద్, రత్నమ్మ రెండవ సంతానమైన కార్తీక్ (15) ఖాజీపేట మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతూ ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో ఉంటున్నాడు. ఆ బాలుడు బావిలో పడి మృతి చెందడంపై తల్లిదండ్రులు, బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సమాచారం తెలుసుకున్న బాధితులు సంఘటన స్థలానికి చేరుకోక ముందే.. మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తీసుకెళ్లడం పట్ల అనుమానం వ్యక్తం చేస్తున్నారు. చేతికి అందివచ్చిన కుమారుడు మృతి చెందడంతో వారు విషణ్ణవదనంలో మునిగిపోయారు.

అగ్నికి అరటి తోటలు ఆహుతి



లింగాల : కాలిపోయిన అరటితోట

లింగాల : పులివెందుల నియోజకవర్గంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదాల్లో రెండు అరటి తోటలు దగ్ధమయ్యాయి. మండలంలోని ఇప్పట్ల గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన అగ్నిప్రమాదంలో అరటి తోట ఆహుతి అయింది. ఆర్ఐ సురేంద్ర కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామ సమీపంలోని బలపాల గుట్టలో షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగాయి. దగ్గరలోనే చాలా మంది రైతుల బోర్లు ఉన్నాయి. ఆ మంటలు ఎండు గడ్డి ద్వారా వ్యాపించి చుట్టూ ఉన్న 30 విద్యుత్ మోటార్ల కేబుల్ వైర్లు, పైపులైన్లు, డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు కాలిపోయాయి. అదే గ్రామంలోని రైతు ఓబుల రెడ్డికి చెందిన రెండు ఎకరాల అరటి పంట, డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు, పోటుకట్టెలు కాలి బూడిదయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను ఆర్పివేశారు.

రూ.3 లక్షల ఆస్తి నష్టం

వేంపల్లె : మండలంలోని బక్కన్నపల్లెకు చెందిన పేరం మహేశ్వరరెడ్డి అరటితోట అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. ఆయనకు గ్రామ సమీపంలో ఐదు ఎకరాల అరటి తోట ఉంది. గుర్తు తెలియని వ్యక్తులు ఎండు గడ్డికి నిప్పుపెట్టడంతో రగులుకుంటూ ఆ తోటకు వ్యాపించింది. బాధిత రైతు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. అప్పటికే మూడు ఎకరాల్లో అరటి చెట్లు, డ్రిప్ పరికరాలు, పైపులు కాలిబూడిదయ్యాయి. దాదాపు రూ.3 లక్షల మేర ఆస్తి నష్టం జరిగింది.

జువారిలో అగ్ని ప్రమాదం



జువారి ఫ్యాక్టరీ నుంచి వస్తున్న మంటలు, పొగ

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని జువారి సిమెంట్ ఫ్యాక్టరీలో ట్రాన్స్‌ఫార్మర్ పేలి అగ్ని ప్రమాదం సంభవించింది. వెంటనే జువారి అధికారులు స్పందించి ఫైర్ ఇంజన్ సాయంతో మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. తర్వాత కమలాపురం అగ్ని మాపక సిబ్బంది ఫైర్ ఇంజన్‌తో వచ్చి మంటలను ఆర్పివేశారు. అయితే ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు.

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

బద్వేలు అర్బన్ : స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఆదివారం లారీ ఢీకొనడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోరుమామిళ్ళ రోడ్డు సమీపంలో మాడిశెట్టి వెంకటసుబ్బయ్య నివసిస్తున్నాడు. తెల్లవారుజామున ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా కృష్ణపట్నం నుంచి తాడిపత్రికి బొగ్గులోడుతో వెళుతున్న లారీ ఢీకొంది. ఈ ఘటనలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రాథమిక వైద్యం అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రమాదానికి కారణమైన లారీని అర్బన్ పోలీసులు స్టేషన్‌కు తరలించారు.

దైవ ధర్మాన్ని మానవులందరికీ చేరవేయాలి

జమా అతె ఇస్లామి హింద్ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ రఫీక్



మాట్లాడుతున్న జమా అతే ఇస్లామి హింద్ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ రఫీక్

ప్రొద్దుటూరు కల్చరల్ : దైవ ధర్మాన్ని మానవులందరికీ చేరవేయాలని జమా అతె ఇస్లామి హింద్ రాష్ట్ర అధ్యక్షుడు జనాబ్ మహమ్మద్ రఫీక్ పేర్కొన్నారు. స్థానిక ఇంటర్ నేషనల్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జమా అతె ఇస్లామి హింద్ స్థాపించి 75 ఏళ్ల అయిన సందర్భంగా ఆధ్యాత్మిక సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమా అతె ఇస్లామి హింద్ సంస్థ సేవలను విస్తృతం చేస్తున్నామని తెలిపారు. సంస్థ చేస్తున్న సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాలపై వివరించారు. దైవాన్ని ఆరాధించడంతోపాటు దైవ ధర్మాన్ని ప్రజలకు వివరించాలని కోరారు. దైవ ధర్మాన్ని అందరికీ చేరవేసే బాధ్యత జమా అతె ఇస్లామి హింద్‌తోపాటు పాటు ముస్లిం సమాజంపై ఉందన్నారు. తమ సంస్థ దివ్య ఖురాన్‌ను 19 భాషల్లోకి అనువదించి ముద్రించినట్లు తెలిపారు. అనేక వేల ఇస్లామి సాహిత్య పుస్తకాలను ముద్రించామని, ఈ పుస్తకాలు మన జీవితంలో ఎదురయ్యే అనుమానాలు, సమస్యలకు పరిష్కారం చూపుతాయని తెలిపారు. కరోనా సమయంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేసినట్లు పేర్కొన్నారు. మహిళా విభాగం చురుగ్గా పని చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా జమా అతె ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో ఉచిత అంబులెన్స్‌ను జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో జమా అతే ఇస్లామి హింద్ కేంద్ర సలహాల మండలి సభ్యుడు మౌలానా ఎజాజ్ అహమద్ అస్లం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరీముద్దీన్, కార్యదర్శి మౌలానా గౌస్ మొహిద్దీన్, జిల్లా అధ్యక్షులు ఎస్ఎస్ మొహిద్దీన్, హుస్సేన్ అహ్మద్, పట్టణాధ్యక్షుడు షరీఫ్, ఖాజీ ఇనాయతుల్లా, ఇమాంలు మౌలానా అ బుసాలెహ రషాది, మహబూబ్ బాషా, జనాబ్‌షా మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, ఖాజీ సయ్య ద్ హబీబుల్లా, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

దుఃఖం ఒక్కటే మిగిలింది!

- రోడ్డు ప్రమాదంలో ముగ్గురు విద్యార్థుల దుర్మరణం
- ముగ్గురూ ఏకైక కుమారులే
- ఆస్పత్రి వద్ద మిన్నంటిన రోదనలు



కారు ఢీకొని దెబ్బతిన్న లారీ ముందుభాగం



ప్రమాదంలో ధ్వంసమైన కారు

'చిన్నప్పటి నుంచి గారాబంగా పెంచాం. కష్టాన్ని నమ్ముకుని కడుపులో పెట్టుకుని చూసుకున్నాం. చదువుల్లో రాణిస్తున్నారని పైసా పైసా కూడబెట్టుకుని పెద్ద చదువులు చదివించాలని నిశ్చయించాం. పెద్ద ఉద్యోగం చేసి మా పేరు నిలబెడతారని కలలుగన్నాం. చరమాంకంలో తోడుగా నిలుస్తున్నారని ఆశలు పెంచుకున్నాం. మిమ్మల్నే తలుచుకుని జీవితాలు నెట్టుకొస్తున్నాం. ఇంతలోనే మమ్మల్నందర్నీ వదిలి అనంతలోకాలకు వెళ్లిపోయారా నాయనా.. మేమెట్టా బతికేది తండ్రీ' అంటూ రోడ్డు ప్రమాదంలో ఒక్కగానొక్క కుమారులను పోగొట్టుకున్న తల్లిదండ్రుల గుండెలు పగిలేలా రోదించిన తీరు అక్కడి వారిని కంటతడి పెట్టించింది. కుప్పం–పలమనేరు రహదారిలో ఆదివారం వేకువ జాము జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులు విగతజీవులు కావడం తీవ్ర విషాదాన్ని నింపింది.

గుడుపల్లె : ఉన్నత చదువులు పూర్తయి త్వరలోనే ఉద్యోగాలు అందుకోవాలనుకున్న వారి ఆశలను విధి తుంచేసింది. చదువుల్లో రాణిస్తూ సమాజంలో ఉన్నతంగా రాణిస్తారని కలలుగన్న తల్లిదండ్రుల కలలను చిదిమేసింది. కుప్పం– పలమనేరు జాతీయ రహదారిలో ఆదివారం వేకువ జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులు మృతి చెందడం విషాదాన్ని నింపింది. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా పెనుబర్తి గ్రామానికి చెందిన సుచింద్రారెడ్డి కుమారుడు శ్రీవికాస్‌రెడ్డి(21), అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు రెడ్డివారిపల్లె గ్రామానికి చెందిన సుబ్బరాయుడు కుమారుడు ప్రవీణ్(24) కుప్పం పీఈఎస్ కళాశాలలో ఎంబీబీఎస్ చదువుతుండగా.. రాజంపేటకు చెందిన రమణయ్య కుమారుడు కల్యాణ్(20) మదనపల్లె మిట్స్ కళాశాలలో ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. వీరు ముగ్గురూ మంచి స్నేహితులు. తల్లిదండ్రులకు ఒక్కగానొక్క కుమారులు కావడంతో అల్లారుముద్దుగా పెంచారు. శనివారం సాయంత్రం మదనపల్లె నుంచి కుప్పం పీఈఎస్‌కు వచ్చిన కల్యాణ్.. ఆదివారం వేకువ జామున 3 గంటల సమయంలో తన స్నేహితుని కారు తీసుకుని శ్రీవికాస్‌రెడ్డి, ప్రవీణ్‌తో కలిసి కుప్పానికి బయలుదేరారు. మార్గంమధ్యలో కుప్పం నియోజకవర్గం గుడుపల్లె మండలం చిన్నశెట్టిపల్లె వద్ద ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న మరో లారీని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ముగ్గురూ అక్కడికక్కడే మృతి చెందారు. గుడుపల్లె పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కన్నీరుమున్నీరు : విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు కుప్పం ఆస్పత్రికి చేరుకుని విగతజీవులుగా పడి ఉన్న తమ బిడ్డలను చూసి కన్నీరుమున్నీరుగా విలపించడం కలచివేసింది. తమపై ఎన్నో ఆశలు పెంచుకున్నామని, ఉన్నత చదువులు చదివి తమను ఉన్నతంగా చూసుకుంటారని ఆశపడ్డామని, ఇంతలో తమ ఆశలు తుంచేసి వెళ్లిపోయారా నాయనా అంటూ గుండెలవిసేలా రోదించడం చూపరులను కంటతడి పెట్టించింది.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

- చదువు మధ్యలో ఆపేసిన లేదా ఫెయిల్ అయిన వారికి 10th, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, Diploma, B.Tech, BCA, MCA, పాసయ్యే ఛాన్స్ కలదు. నాగేష్ అకాడమి, కడప. 7569470023 [G-6270]

REAL ESTATE

PLOTS FOR SALE

- 7 లక్షలకే 25 సెంట్ల భూమి 100 ఎర్ర చందనం మొక్కలతో, 10 సం॥లలో కోట్ల ఆదాయం, మీ పిల్లల భవిష్యత్‌కు బంగారు బాట వేసే సదవకాశం, ఒక పెట్టుబడి రెండులాభాలు ✆ 99893 17616 [B-2325]

SERVICES

HEALTH CARE

- పల్లా హాస్పిటల్, 7 రోడ్ సర్కిల్ నందు ఆర్థోపెడిక్ మరియు గైనకాలజీ విభాగంలో ఉచిత OP శిబిరం: 28-02-2023 మంగళవారం, సమయం: 9.00 AM నుండి 1.30 PM గమనిక: రూ.2000/- విలువైన BMD బోన్ డెన్సిటీ టెస్ట్ ఉచితంగా మరియు సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ ఉచితంగా చేయబడుతుంది. ఈ శిబిరంలో: కీళ్లనొప్పులు, మోకాళ్ల నొప్పులు, సర్వైకల్ స్పాండిలైటిస్, లంబార్ స్పాండిలైటిస్, సయాటికా, కీళ్ల నొప్పులకు ఉచితంగా చూస్తారు. Ph: 9849040153 [H-796718]

GOLD FINANCE

- బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 90009 92521 [B-2281]

ఆయుర్వేదం


- బొల్లి, తెల్లమచ్చలు, సోరియాసిస్‌లకు ఎటువంటి పత్యం లేని చికిత్స కలదు. మందులు ఉచితముగా ఇవ్వబడును. సంప్ర: 9603055647, 7995392747 [G-11]

WANTED

- కడప నందు పనిచేయుటకు అనుభవం గల సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. Q: 6th పైన, వయస్సు: 25 సం॥లు పైన, జీతం: 10,000. 12 గంటలు డ్యూటీ, సంప్ర: 9703508754, 7095004007. [C-781409]
- కడప టౌన్‌లోని ప్రముఖ కొరియర్ సంస్థ నందు పనిచేయుటకు టెలికాలర్స్ మరియు డేటా ఎంట్రీ ఆపరేటర్ (F) కావలెను. సంప్ర: 9866226198, 9573264975. [C-789376]
- SSC/Inter /డిగ్రీ/ITI, డిప్లొమా,(P/F) అయ్యి ఖాళీగా ఉన్న 39 (స్త్రీ/పు.లు మా సంస్థలో పనిచేయుటకు కావలెను. జీ: 14 వేలు + DA 6 వేలు + ఫ్రీ రూం. ఫీజు లేదు. మోచంపేట, కడప. 97018 64175 [L-794959]
- ఇంటి దగ్గర ఉండి మా కంపెనీ బల్బులు ఫిట్‌చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15 వేలు ఆపైన వరకు జీతం. మరిన్ని వివరాలకు సంప్ర : 78158 11791 [L-519]
- Corporate బ్యాంక్‌లలో పనిచేయుటకు Cashiers, Clerks,Senior Officer, (Sales) Attenders కావలెను. జీ: 12,000 -40,000 వరకు. ✆ 9642506425, 8297797197. [T-4032]
- కడప (5), జిల్లా(100) Field/ Home Jobs. P/F Time-5K+,F/Time-20K+, స్త్రీ/పు అందరికీ అవకాశం, గ్రామం/ మండలం/ నియోజకవర్గం వారిగా అవకాశం. 8247806787. [T-4034]
- మిడ్వెస్ట్ గ్రానైట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ - కడప సిద్ధవటం నందు పనిచేయుటకు మంచి అనుభవం కలిగిన "Excavator Machine" ఆపరేటర్స్ కావలెను. జీతం: 25,000+PF+ESI+ గ్రాట్యుటీ సదుపాయం కలవు. ఫోన్ : 9949406068. [HA-1034]
- VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోడానికి స్త్రీలు/ పురుషులు అర్జెంటుగా కావలెను. ఆయా, వార్డ్ బాయ్స్ నర్సులు, వంటవారు, Rmp Dr. Q-5th-డిగ్రీ, 10-30 వేలు జీతం, భో+రూం ఫ్రీ, Hyd. ఫోన్ : 7995365999 [HA-1030]
- రాయచోటిలోని మోర్ సూపర్ మార్కెట్ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. శాలరీ : 11000/- 8H, EPF+ ESI కలవు. 9885295999, 9581952222 [G-396]
- లేపాక్షి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి+ భోజనం. జీతం: 20K ఏజెంట్ కమీషన్ 5K. ఫోన్ : 9640300074 [HA-1019]
- ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-781909]
- సంపన్నుల ఇళ్లలో మంచాన వున్న వృద్ధులను, పేషంట్లను వారి ఇంటి వద్దనే బాధ్యతగా చూసుకొనుటకి ఆయాలు, కేర్ టేకర్స్ MF VJA కి కావలెను. Sal: 14-20K, వసతి భోజనం. 9160835559, 7815835561 [B-909]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



సాక్షి
క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705907418
9705944423
9010224479
9010223797
9705898007